క్లుప్తంగా

20న నిరసన

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఈ నెల 20వ తేదీన నిరసన చేపట్టనున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘ నాయకులు పాలక రంజిత్‌కుమార్, తాడంగి సాయిబాబు, ఆరిక ప్రభాకరరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల నుంచి ఒక్కొక్కరు చొప్పున, ఏకలవ్య పాఠశాలలకు ఇద్దరేసి చొప్పున ఏఎన్‌ఎంలను నియమించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు, కళాశాల వసతిగృహాలకు ఏఎన్‌ఎంలను నియమించకపోవడాన్ని వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు.

అ'పూర్వ' కలయిక

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకున్న 1989 టెన్త్ బ్యాచ్ పూర్వపు విద్యార్థులు మంగళవారం పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. తాము చదువుకున్న తరగతి గదుల్లో కాసేపు సరదాగా గడిపి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి సహపంక్తి భోజనాలు చేశారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



పెదపెంకిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

బలిజిపేట: సంక్రాంతి సందర్భంగా మండలంలోని పెదపెంకి గ్రామంలో 100 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చీకటి చిన్నారాయణ జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు గ్రామంలో ఉండే 100మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి ఒక దుప్పటి, రూ.20, ఒక ఫలం అందజేశారు. గడిచిన 15సంవత్సరాల నుంచి ఈవిధంగా సంక్రాంతికి నిరుపేదలకు వస్త్రదానం చేయడం ఎంతో గొప్ప విషయమని గ్రామస్తులు దాతలను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు, చీకటి గోపాల్ నాయుడు, లక్ష్మణ్‌నాయుడు, అప్పలనాయుడు, జి.అప్పలనాయుడు మాస్టారు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ

పూసపాటిరేగ : మండలంలోని నడిపల్లి గ్రామంలో సంక్రాంతి పండగలో భాగంగా లంకలపల్లి శ్రీనివాసరావు సహకారంతో ఆదివారం నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్రాంతి పండగ సందర్భంగా వస్త్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. పండగను గ్రామస్తులు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని కందివలస గ్రామంలో సర్పంచ్ దేశెట్టి గణేష్ సహకారంతో గ్రామస్తులకు నూతన వస్త్రాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామస్తులకు అందరూ సుఖసంతోషాలతో వుండాలని ఆకాంక్షించారు.

ఎస్‌డబ్ల్యూపీసీలు పనిచేసేలా కృషి చేయాలి



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ కుమారవర్మ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో లక్షలాది రూపాయలతో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీల ద్వారా చెత్తనుంచి సంపద తయారుతోనే పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కాగలవని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన అంటిపేట, పణుకుపేట, రంగంపేట గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధుల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి, తడి, పొడి చెత్తను సేకరిస్తున్నామన్నారు. చెత్త నుంచి సంపద తయారు చేయడానికి గ్రామ శివారులో ఎస్‌డబ్ల్యూపీసీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. మండలంలోని ఉన్నతాధికారుల సూచనల మేరకు అడపాదడపా సేంద్రియ ఎరువు తయారుచేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. అన్ని పంచాయతీలకు చెత్త నుంచి సంపదతయారుకోసం షెడ్‌ల నిర్మాణం జరిగిందని వాటిని వినియోగంలోకి తేవాలని కోరుతున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా మంగమ్మ పేరంటాలు జాతర



రాజాం: బొద్దాంలో మంగమ్మతల్లి పేరంటాలుకు మొక్కులు చెల్లిస్తున్న ఉత్తరాంధ్ర రజకుల సంక్షేమ సంఘ సభ్యులు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో మంగమ్మ పేరంటాలు జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రజకుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఘటాలు ఊరేగించి, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



పాలకొండ రూరల్: మేలుకొలుపు కార్యక్రమంలో భక్తిగీతాలను ఆలపిస్తూ తిరువీధిలో పాల్గొన్న భక్తులు



కొమరాడ: జంఝావతి డ్యామ్ వద్ద పర్యాటకుల సందడి



గరుగుబిల్లి: డూడూ బసవన్న



గరుగుబిల్లి వీధుల్లో శ్రీరామ కీర్తనలు ఆలపిస్తూ సందడి చేస్తున్న హరిదాసు

సంక్రాంతి సందడి

సంక్రాంతి పండగ సందడి ఊరూవాడా నెలకొంది. మూడు రోజుల పండగ కోసం ఎక్కడెక్కడ నుంచో వచ్చిన బంధువులు, స్నేహితులతో గ్రామాలు కలకలలాడుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో కూడా సందడి నెలకొంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, జాతరలు, అన్నదానాలు, వస్త్రదానాలు ఇలా దేనికవే ప్రత్యేకతను సంతరించుకొని జనం రద్దీతో సందడిగా కనిపిస్తున్నాయి. పల్లెలైతే సంబరం జరిగేలా కలకలలాడుతున్నాయి. – సాక్షి నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం: ఎస్.కె.పాడు గ్రామంలో అలరించిన యువతుల నృత్య ప్రదర్శన



జియ్యమ్మవలస: పెదకుదమలో పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం



గరుగుబిల్లి: పెద్దూరులో పితృదేవతలను పొగుడుతున్న జంగమయ్య



గరుగుబిల్లిలో ఓ ఇంటి ముందు వేసిన సంక్రాంతి ముగ్గు



భామిని: మనుమకొండలో డ్యాన్స్ పోటీలలో యువతుల నృత్యాలు

మానవ సేవే మాధవ సేవ



సభలో మాట్లాడుతున్న రమణ

పాలకొండ: మానవ సేవే మాధవ సేవ అని సత్యసాయి ప్రతినిధి ఎస్‌వి.రమణ అన్నారు. మండలంలోని పనుకువలస గ్రామంలో మంగళవారం దివ్యజ్ఞాన సత్సంగ సభ నిర్వహించారు. పండగ సందర్భంగా గ్రామంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సామంతుల దామోదరరావు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక దివ్యజ్ఞాన సత్సంగ సభలో సత్యసాయి ప్రతినిధులు ప్రసంగించారు.

అయోధ్య అక్షతల పంపిణీ

భామిని: మండలంలోని కాట్రగడ – బీలో మంగళవారం అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపన నుంచి వచ్చిన పవిత్ర అక్షతలను ఇంటింట పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తోట సింహాచలం ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు, హరేరామ భజన కమిటీ సభ్యులు నిర్వహించారు. ముందుగా శ్రీమృత్యుంజయేశ్వరుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొని వెళ్లి ఇంటింటా అందించారు. శ్రీరాముని చిత్రాలు, ఆహ్వానాలు భక్తులకు అందజేశారు.

పేదలకు వస్త్రదానం



పేదలకు వస్త్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, దాతలు

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి, పనుకువలస గ్రామాల్లో ఏటా సంక్రాంతి పర్వదినాల్లో పేదలకు వస్త్రదాన కార్యక్రమాలను చేపట్టడం ఆనవాయితీ. ఈ క్రమంలో మంగళవారం అట్టలి గ్రామ పంచాయతీ కేంద్రం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు మంగిపూడి రామారావు, సర్పంచ్ సంధ్యారాణి, కె.సూర్యనారాయణ, శిర్లాపు రాము తదితరులు వంద మందికి చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పనుకువలసలో విశ్రాంత ఉపాధ్యాయుడు కోట మోహనరావు నేతృత్వంలో గ్రామస్తులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట మంజు భార్గవి, ఎంపీటీసీ కోట అజేయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమాధుల వద్ద డిప్యూటీ సీఎం

- పోలమాంబను దర్శించిన రాజన్నదొర



తల్లిదండ్రుల సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న రాజన్నదొర

మక్కువ: మకర సంక్రాంతి పండగను డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తన కుటుంబసభ్యులతో మక్కువ మండలంలోని మర్రివానివలస గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. మంత్రి రాజన్న దొర గ్రామ సమీపంలోని తల్లిదండ్రుల సమాధుల వద్దకు వెళ్లి నివాళులర్పించారు. కాసేపు కుటుంబ సభ్యులతో, గ్రామ ప్రజలతో ముచ్చటించారు. ఏటా సంక్రాంతి పండగకు తన సొంత గ్రామం మర్రివానివలసకు ఆయన వచ్చి, తల్లిదండ్రులు సమాధుల వద్దకు గ్రామస్తులతో వెళ్లి ఆచారం ప్రకారం పూజలు చేసి, నివాళులర్పిస్తారు. అలాగే శంబర గ్రామంలో కొలువైన ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారిని సోమవారం కుటుంబ సభ్యులతో మంత్రి రాజన్నదొర దర్శించుకున్నారు. దేవదాయశాఖ అధికారులు ఆయనను సాదరంగా స్వాగతించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.

రహదారి భద్రతపై అవగాహన తప్పనిసరి



పార్వతీపురం టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణా శాఖాధికారి టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: రహదారి భద్రతపై అవగాహన తప్పనిసరి అని జిల్లా ప్రజారవాణా శాఖాధికారి టీవీఎస్ సుధాకర్ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో రోడ్డు భద్రతా వారోత్సవ ప్రారంభ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ '0' (జీరో) యాక్సిడెంట్‌గా సంస్థ ఉండాలని, డిఫెన్సివ్ డ్రైవింగ్ చేస్తూ, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డ్రైవర్లు తమ డ్రైవింగ్ నైపుణ్యం మెరుగుపరచుకోవాలని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడరాదని తెలియజేశారు. కార్యక్రమములో డిపో మేనేజర్ ఈఎస్‌కే దుర్గ ఎం.ఎఫ్. రాము అసోసియేషన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు బాధ్యతగా పాటించాలి

సాలూరు: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని సాలూరు పట్టణ సీఐ జి.దేముడుబాబు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద సోమవారం నిర్వహించిన రోడ్డు భద్రతా మహోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తూ వాహనాలు నడపడం వల్ల చాలావరకు రోడ్డుప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాల్లో పలువురు మరణించడం మరికొంతమంది తీవ్రగాయాలపాలవుతుండడం ఫలితంగా వారితో పాటు వారిమీద ఆధారపడిన వ్యక్తులు, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని పేర్కొన్నారు. మితిమీరిన వేగంతో ప్రయాణం చేయరాదని చెబుతూ ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణం క్షేమం

వీరఘట్టం: సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్వగ్రామాలకు వచ్చి తిరుగు ప్రయాణాలు చేసేవారు సురక్షిత ప్రయాణాలు చేయాలని ఎస్‌ఐ ఎం.గోవింద సూచించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పరిమిత వేగంతో ప్రయాణాలు చేసి తిరుగు ప్రయాణంలో కూడా సుఖంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని వాహనదారులకు సూచించారు. ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ప్రమాదాల వల్ల కలిగే అనర్థాలను గుర్తించి వాహనదారులు, ప్రజలు తెలుసుకోవాలన్నారు.

ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి



నృసింహస్వామి అలంకరణలో వేంకటేశ్వరస్వామి

మెంటాడ: స్థానిక శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని స్వామి వారు ప్రత్యేకాలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని, స్వామి వారిని నృసింహస్వామిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఏడాది పొడవునా భక్తులకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆలయ ప్రధానార్చకులు పీసపాటి కృష్ణమాచార్యులు స్వామి వారికి పూజలు చేశారు.

మాతృభూమి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రవచనాలు

సీతానగరం: మకరసంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మాతృభూమి సేవాసంస్థ ఆధ్వర్యంలో న్యూజిలాండ్‌కు చెందిన కృష్ణభక్తిపరుడు సన్నివాస్ దాస్ ప్రభూజీ సీతానగరం మండలంలోని బూర్జ కృష్ణ మందిరంలో కృష్ణభక్తులకు శ్రీమద్భాగవతం, భగవద్గీత ప్రవచనాలు చేశారు. ఈ మేరకు మాతృభూమి సేవాసంస్థ సభ్యులు మాట్లాడుతూ బొబ్బిలి పట్టణానికి చెందిన ప్రత్యేక వైద్య నిపుణుడు, సంఘ సేవకుడు డాక్టర్ గుల్ల రామ్‌నరేష్ పిలుపు మేరకు సన్నిదాస్ ప్రభూజీ పాల్గొని సనాతన ధర్మాన్ని రక్షించడానికి వందలాది మంది కృష్ణమందిరం గీతాభక్తులకు ప్రవచనాలు ఇచ్చినట్లు చెప్పారు. డాక్టర్ రామ్‌నరేష్ మాట్లాడుతూ వివిధ గ్రామాలకు చెందిన భక్తులంతా బూర్జలో సువర్ణముఖి నది సమీపాన కృష్ణమందిరం నిర్మించడం, ఏటా గీతాపారాయణం, చాతుర్మాస దీక్షలు, పూజా కార్యక్రమాలు చేయడం మంచి పరిణామమన్నారు.

మాతృభూమి సేవా సంస్థ సత్కారం

మండలంలోని బూర్జ మాతృభూమి సేవా సంస్థ ప్రతినిధులు, కుటుంబసభ్యులు ఇచ్చిన ప్రోత్సాహంతో గ్రామంలో సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు కె శివకుమార్, వై జోగినాయుడు,ఈదుబిల్లి వెంకట శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బూర్జగ్రామం నుంచి 2023–24 క్యాలండర్ సంవత్సరంలో ఉన్నత వృత్తివిద్యా కోర్సులకు ఎంపికైన వారిని, ఉపాధ్యాయులుగా ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమితులైన వారిని మాతృభూమి సేవా సంస్థ సభ్యులు సత్కరించారు. ఈ సత్కారం పొందిన వారిలో మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమితులైన బలగ అప్పలనాయుడు, కొల్లి స్వామినాయుడు, రెడ్డి భాస్కరరావు, ఎంబీబీఎస్ సీటు సాధించిన ఎ.తేజేష్‌నాయుడులు ఉన్నారు.

ఏకాగ్రతతో బస్సులు నడపాలి



రోడ్డు భద్రతా మాసోత్సవాల బ్యానర్ ప్రదర్శిస్తున్న డీఎం వెంకటేశ్వరావు, ఆర్టీసీ ఉద్యోగులు

పాలకొండ రూరల్: ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను ఏకాగ్రతతో నడపాలని డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం డిపో పరిధిలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలుపులు, పాఠశాలల కూడళ్ల వద్ద, జన సముదాయాలు, వాహనాల రద్దీ అధికంగా ఉన్నచోట తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. విధులకు హాజరయ్యే డ్రైవర్, కండెక్టర్ బస్సును డిపో నుంచి బయటకు తీసుకువచ్చే క్రమంలో వాటి కండీషన్ సరి చూసుకోవాలని, సమస్యలు గుర్తిస్తే సంబంధిత విభాగం అధికారులకు తెలియజేయాలన్నారు. పలు సూచనలు డీఎం , ఎల్‌హెచ్ వండాన రమణమూర్తి, హెడ్‌గార్డు బి.రాంబాబు వివరించారు. ఈయూ జోనల్ సెక్రటరీ బీకే.మూర్తి, స్టోర్ ఏడీసీ డివిఎస్.రాజు, ఎంఎఫ్ ఏడీసీ ఎస్.గురవయ్య తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన యువత



ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన యువత

పార్వతీపురంటౌన్: స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేస్తున్న క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు మెచ్చి పార్వతీపురం మున్సిపాలిటీ పరిధి జగన్నాథపురంలోని 29, 2వ వార్డులకు చెందిన జనసేన యువ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. ఎమ్మెల్యే జోగారావు క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన యువత అందరికీ ఎమ్మెల్యే జోగారావు పార్టీ కండువాలు వేసి సాదరస్వాగతం పలికారు. మీరందరూ మెచ్చిన విధంగా, మీకు నచ్చిన విధంగా మన ప్రభుత్వం పరిపాలన కొనసాగుతుందని సీఎం జగన్‌మోహన్ రెడ్డిని రానున్న కాలంలో మళ్లీ తప్పక గెలిపించవలసిన బాధ్యత మనందరిపై ఉందని అందుకు మీరంతా పార్టీలోని వారందరితో కలిసి పనిచేసి ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్ సభ్యులు రణభేరి చిన్నంనాయుడు, త్రినాథ, నాయకులు ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు గర్వకారణం



మాట్లాడుతున్న టూరిజం బోర్డు డైరెక్టర్ శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్:

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం దేశానికే గర్వ కారణమని ఏపీ టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సీతారామునిపేట గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా 125 అడుగుల భారీ విగ్రహం ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, అటువంటి మహనీయుడి విగ్రహాన్ని నెలకొల్పడం చరిత్రలో మైలు రాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.